# మామిడిపల్లి, పెర్కిట్‌లో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషితో విలీన గ్రామాలకు రూ.17కోట్ల నిధుల కేటాయింపు
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు



మామిడిపల్లిలో పూర్తయిన బీటీ రోడ్డు నిర్మాణం



పెర్కిట్ ఊర చెరువు కట్టపై కొనసాగుతున్న మినీ ట్యాంకుబండ్ నిర్మాణ పనులు

ఆర్మూర్, అక్టోబర్22: ఆర్మూర్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి 3వ గ్రేడ్ మున్సిపాలిటీగా 2007లో ఏర్పడింది. ఆర్మూర్ మండలంలో మామిడిపల్లి, పెర్కిట్ మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉండేవి. ఆంధ్రప్రదేశ్ సమైక్య పాలనలో ఆర్మూర్ మండలంలో ఈ రెండు గ్రామాల రెవెన్యూయే అధికంగా ఉండేది. అయినప్పటికీ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉండేది. ప్రధాన రోడ్లు మినహాయిస్తే గ్రామాల్లోని రోడ్లన్నీ గుంతమయంగా, మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ అధ్వానంగా ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై దృష్టిసారించారు. 2018లో పెర్కిట్, మామిడిపల్లి గ్రామాలను ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో ఆర్మూర్ మున్సిపల్ 2గ్రేడ్ పురపాలక సంఘంగా ఏర్పడింది. మున్సిపాలిటీలో విలీనంకావడంతో ఈ రెండు గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషితో అభివృద్ధి దూసుకుపోతున్నాయి.

## రూ.17కోట్లతో అభివృద్ధి పనులు

విలీన గ్రామాలైన పెర్కిట్, మామిడిపల్లిలో సుమారు 44వేల జనాభా ఉంది. గతంలోని గ్రామ పంచాయతీ వార్డులను జానాభా ఆధారంగా మొత్తం 11 మున్సిపల్ వార్డులుగా ఏర్పాటు చేశారు. పెర్కిట్ పరిధిలో 5వ వార్డు నుంచి 9వ వార్డు వరకు, మామిడిపల్లి పరిధిలో 20వ వార్డు నుంచి 25వ వార్డు వరకు ఏర్పాటు చేశారు. విలీన గ్రామాల్లో కొత్తగా ఏర్పడిన 11 వార్డులు ఆర్మూర్ మున్సిపాటీలో అర్ధభాగమయ్యాయి. టీయూఎఫ్ఐడీఈ కింద ఇప్పటికే రూ.17కోట్ల నిధులు మంజూరు కావడంతో వార్డుల్లోని ప్రధాన రోడ్లు బీటీలుగా, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఇప్పటికే టెండర్ ప్రకియ పూర్తయ్యింది. ఇందులోప్రస్తుతం పెర్కిట్, మామిడిపల్లిలోని పలు ప్రధాన రోడ్లపై బీటీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో వైపు రూ. 2కోట్లతో పెర్కిట్ ఊర చెరువుపై మినీ ట్యాంకు బండ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో నెల రోజుల్లో పెర్కిట్‌లో పనులు పూర్తికానున్నాయి.

## ప్రజల ఆనందం

గతంలో ఆర్మూర్ మున్సిపాలిటీకి పెర్కిట్, మామిడిపల్లి గ్రామాల మధ్య శివారు కాలనీలు కొంత భాగం మున్సిపల్ పరిధిలో, మరి కొంత భాగం గ్రామాపంచాయతీ పరిధిలో ఉండేంది. దీంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. ఏదైనా పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేసేవారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనం కావడంతో అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపడుతున్నారు. శివారు కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### జీవన్‌రెడ్డికి ధన్యవాదాలు..

**-ఆకుల రాము, కౌన్సిలర్, మామిడిపల్లి**



సమైక్య పాలనలో మా గ్రామ రోడ్లు అధ్వానంగా ఉండేవి. డ్రైనేజీ నీరు రోడ్లపై పారేది. స్వరాష్ట్రంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషితో మున్సిపల్ విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రూ.17 కోట్లతో బీటీ, సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి టెండరు పూర్తయింది. బీటీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో సీసీ, డ్రైనేజీ పనులు ప్రారంభం అవుతాయి. నిధుల మంజూరుకు కృషి చేసిన జీవన్‌రెడ్డి ధన్యవాదాలు.

## ముగిసిన కబడ్డీ పోటీలు

గాంధారి, అక్టోబర్ 21: మండలంలోని సర్వాపూర్ గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన మండస్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. 23 జట్లు పాల్గొనగా, గౌరారం ప్రథమ, గుడివెనుక తండా ద్వితీయ స్థానంలో నిలిచాయి. సంగోజీపేట్ జట్టు మూడో స్థానం దక్కించుకున్నది. విజేత జట్లకు రైతుబంధు సమితి మండల కన్వీనర్ మనోహర్ రావు ట్రోఫీలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, జ్ఞానేశ్వర్ గౌడ్, వినయ్, సాయి కుమార్, సర్వాపూర్ ఏఈ లింబాద్రి, పీఈటీలు రవి, దేవీదాస్, అంజి, ఆశోక్ పాల్గొన్నారు.

## మద్యం తరలిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 21: అక్రమంగా మద్యం తరలించినా బెల్టు షాపుల్లో విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ హెచ్చరించారు. నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, కామారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రాజు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి శివారులో శనివారం వాహనాలను తనిఖీ చేశారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

శక్కర్‌నగర్, అక్టోబర్ 22: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం యూత్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చికి వచ్చిన యువతీ యువకులకు చర్చి ఫాదర్ రెవరెండ్ ముల్కల ప్రభాకర్, నాగేపూర్ చర్చి ఫాదర్ రెవరెండ్ సుధాకర్ పలు సూచనలు చేశారు. యువత మార్గదర్శకంగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని వాఖ్యాలను, ఆయన చూపిన మార్గంలో నడిచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రెవరెండ్ ప్రభాకర్, సుధాకర్ దేవుని వాఖ్యాలను వినిపించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యువతీ యువకులతోపాటు చర్చి ప్రతినిధులు దమ్మల్ల జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, పుష్పరాజ్, సుదీప్, యూత్ సెక్రటరీ ప్రమోద్ పాల్గొన్నారు.

**మెట్టులో ..**

మాక్లూర్, అక్టోబర్22: మండలంలోని మెట్టు గ్రామంలోని చర్చిలో శని, ఆదివారం రెండు రోజులు యూత్ రీట్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్స్ రెవరెండ్ రూబెన్, రెవరెండ్ సోలమన్‌రాజ్ మాట్లాడుతూ సమాజంలో జీవిస్తున్న కాలంలో నీతి, నీజాయితి, దయతో, సక్రమమమైన మార్గంలో యువతీ యువకులు నడుచుకోవాలని సూచించారు. దేవుని సందేశాలను వినిపించారు. కార్యక్రమంలో అండ్రూస్, విద్యాసాగర్, చరణ్, కార్యాదర్శి అనిల్, పాస్టరేట్ కోశాధికారి ప్రసాద్‌రాజ్, వినయ్‌సాగర్, మాదాపూర్, పాల్దా, బొంకన్‌పల్లి, తిర్మన్‌పల్లి తదితర గ్రామాల నుంచి యువకులు పాల్గొన్నారు.



శక్కర్‌నగర్ సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మెట్టులో యూత్ రీట్రీట్ కార్యాక్రమంలో పాల్గొన్న యూవతీ,యువకులు

## అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయం




బోధన్ రూరల్ పీసీ ప్రసన్న కుమార్‌ను సన్మానిస్తున్న బోధన్ ఏసీపీ

శక్కర్‌నగర్, అక్టోబర్ 22:ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా రెండు మార్లు పెద్ద మొత్తంలో డబ్బులు పట్టుకున్న బోధన్ రూరల్ పోలీస్ కానిస్టేబుల్ ప్రసన్న కుమార్‌ను బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రసన్న కుమార్ విధులను అంకితభావంతో నిర్వహిస్తున్నాడని, ఆయనను ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సాలూరా అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా రూ. 5లక్షలు, మరోమారు రూ. 2లక్షలు పట్టుకున్నాడని ఏసీపీ వెల్లడించారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్, ఏసీపీ కార్యాలయం సీనియర్ రైటర్ యూసుఫ్ ఉన్నారు.

## విశ్వ మనుమయ సంఘం బోధన్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న వడ్ల సతీశ్ చారీ

బోధన్, అక్టోబర్22: తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ మనుమయ (కమ్మరి, వడ్రంగి) సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుల సమక్షంలో హైదరాబాద్‌లో ఆ సంఘం బోధన్ నియోజకవర్గం, మండల కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా వడ్ల సతీశ్‌చారీ, ప్రధాన కార్యదర్శిగా పంచాల్ చందు చారీ, కోశాధికారిగా పంచాల్ సాయినాథ్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వడ్ల లాలయ్య చారిని ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి, ఉపాధ్యక్షుడు సుంకోజు రమేశ్ చారీ నియామక పత్రాలు అందచేశారు.

## భరతనాట్యంలో ప్రతిభ చాటిన సహస్రకు సన్మానం



కుమారి సహస్రను సన్మానిస్తున్న సంఘం నాయకులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 22: బోధన్ పట్టణం శ్రీ నగరేశ్వర శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కుమారి సహస్ర భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది. మహిసాసుర మర్దనిగా భరతనాట్యం నిర్వహించిన కుమారి సహస్రను ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి వెంకటేశం గుప్త, కార్యదర్శి కంటాల రమేశ్, కోశాధికారి పబ్బ మురళి, సంఘం సీనియర్ నాయకులు కొత్త రాజేశ్వర్, మాశెట్టి నర్సయ్య గుప్త, బిల్లకంటి అనీల్, ఎక్కిలి రామకృష్ణ తదితరులు శాలువా కప్పి సన్మానించారు.

## వాహనాల తనిఖీ

భీమ్‌గల్, అక్టోబర్ 22: మండల కేంద్రంలోని వేల్పూర్ రోడ్డు సమీపంలో ఆదివారం ఎన్నికల తనిఖీ అధికారి రామారావు ఆధ్వర్యంలో పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తరలిస్తే రసీదు చూపాలని లేనిచో డబ్బులను సీజ్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు